ప్రజాశక్తి
సోమవారం 23 అక్టోబర్ 2023
5
శ్రీ సత్యసాయి

రాచపాలెం దంపతులను సన్మానిస్తున్న దృశ్యం

పడిపోతున్న భూగర్భజలాలు

3.89 మీటర్ల లోతుకు జలమట్టం

ఎండివాడుతున్న వేరుశనగ

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

వర్షాభావ పరిస్థితులు నెలకొన్న తరుణంలో అనంతపురం జిల్లాలో భూగర్భ జలమట్టాలు గణనీయంగా పడిపోతున్నాయి. అనంతపురం జిల్లాలో 3.89 మీటర్లు లోతుకు నీటిమట్టం పడిపోయింది. ఈశాన్య రుతుపవనాల సమయంలోనూ వర్షాల్లేకపోవడంతో రబీ సాగుపైనా ఈ ప్రభావం పడే అవకాశాలు కనిపిస్తున్నాయి. నైరుతి రుతుపవనాల్లో వర్షాభావం నెలకొంది. ఇప్పుడు ఈశాన్య రుతుపవనాల సమయంలోనూ వర్షాల్లేవు. జిల్లాలో ఈ నెలాఖరు దాటితే వర్షాలు పడటం సాధారణంగానే తక్కువ. ఇప్పటికే మూడవ వారం వచ్చినా వాన రాకపోవడంతో రాబోయే రోజుల్లో వర్షాలు పడే అవకాశాలు చాలా తక్కువ. దీంతో భూగర్భజలాలు పడిపోతున్నాయి.

3.89 మీటర్లలోతుకు పడిపోయిన భూగర్భ జలాలు

గతేడాడితో పోలిస్తే ఈసారి భూగర్భజలాలు ఇప్పటికే 3.89 మీటర్లు పడిపోయాయి. వచ్చే వేసవి నాటికి మరింత తగ్గిపోయే సూచనలు కనిపిస్తున్నాయి. ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా ఈ ఏడాది వర్షాలు సానుకూలంగా లేవు. అనంతపురం జిల్లా పరిధిలో ఇప్పటి వరకు 399 మిల్లీమీటర్లు వర్షపాతం కురవాల్సుండగా 253 మిల్లీమీటర్లు మాత్రమే వర్షపాతం నమోదయింది. సాధారణం కంటే 36 శాతం వర్షపాతం లోటుంది. ఇక సత్యసాయి జిల్లా పరిధిలో 446 మిల్లీమీటర్లకుగానూ 298 మిల్లీమీటర్లు నమోదయింది. రెండు జిల్లాల్లో కలిపి సుమారు 45 మండలాల్లో వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. ఈ నేపథ్యంలో రెండు జిల్లాల పరిధిలో భూగర్భ జలాలు అనేక ప్రాంతాల్లో గరిష్ఠంగా పడిపోతున్నాయి. అనంతపురం జిల్లా పరిధిలో రాయదుర్గంలో ఈ ఏడాది ఇప్పటి వరకు గరిష్ఠంగా 9.41 మీటర్ల నీటిమట్టం పడిపోయింది. కణేకల్ 8.85 మీటర్లు, కంబదూరు మండలంలో 6.27, బొమ్మనహాళ్ 5.69, బుక్కరాయసముద్రంలో 4.83 మీటర్లు లోతుకు పడిపోయాయి. బెళుగుప్ప, శెట్టూరు మండలం మినహా తక్కిన అన్ని మండలాల్లో మీటరు కంటే అధికంగా నీటిమట్టం పడిపోయింది. సత్యసాయి జిల్లాలో గరిష్ఠంగా గోరంట్ల మండలంలో 16.91 మీటర్లు పడిపోయాయి. గోరంట్ల మండలంలో 14.85 మీటర్లు, కొత్తచెరువు మండలంలో 10.60, సోమందేపల్లి 9.55, చిలమత్తూరు 9.94, పరిగి 9.22 మీటర్లు పడిపోయాయి. నల్లచెరువు 8.56 మీటర్లు ఇలా ఈ జిల్లాలో ప్రతి మండలంలోనూ నీటిమట్టం పడిపోవడం గమనార్హం.

రబీ సాగుపై ప్రభావం

అక్టోబరులోనూ వర్షాభావానికి తోడు భూగర్భ జలాలు పడిపోతుండటంతో రబీసాగు ప్రశ్నార్థకంగా మారనుంది. రెండు లక్షల ఎకరాలకుపైగా రబీలో పంటలు సాగవుతాయి. నల్లరేగడి నేలల్లో పత్తి, మిరప పంటలు సాగవుతాయి. ఇప్పటికే వేసిన పంటలు ఎండవాడుతున్నాయి. భూగర్భ జలాలు పడిపోతే బోరుబావుల్లోనూ నీటిమట్టం పడిపోయి సాగు ప్రశ్నార్థమవనుంది.



మిత్ర సమ్మిత విమర్శకుడు 'రాచపాలెం'

విమల స్మారక సాహిత్య జీవిత సాఫల్య పురస్కార ప్రదానోత్సవంలో వక్తలు

ప్రజాశక్తి - అనంతపురం

యువత సవరించుకోవడానికి వీలుగా ఉండే విమర్శ రాసే మిత్ర సమ్మిత విమర్శకుడు రాచపాలెం అని వక్తలు కొనియాడారు. విమల శాంతి సాహిత్య సాంస్కృతిక సేవాసమితి, శ్రీ సాయిబాబా నేషనల్ డిగ్రీ కళాశాల సంయుక్త నిర్వహణలో ఆదివారం స్థానిక శ్రీ సాయిబాబా నేషనల్ డిగ్రీ కళాశాలలో విమలస్మారక సాహిత్య జీవిత సాఫల్య పురస్కార ప్రధాన సభను నిర్వహించారు. ప్రముఖ కవి తూముచెర్ల రాజారాం అధ్యక్షత వహించిన ఈ సభకు గుర్రం జాషువా కళా పీఠం వ్యవస్థాపక అధ్యక్షులు, మాజీ మంత్రి శ్రీ డొక్కా మాణిక్య వరప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో మంచి భవిష్యత్తును చూడాలనే తపన కలిగిన గొప్ప సౌజన్యశీలి, నిబద్ధ విమర్శకుడు ఆచార్య రాచపాలెం చంద్రశేఖర్ రెడ్డి అని అన్నారు. లివింగ్ లెజెండరీ రాచపాలెం ప్రస్తుత తెలుగు సాహిత్య ప్రక్రియలో సునిశిత పరిశీలన తో విమర్శ చేసే గొప్ప దార్శనిక వ్యక్తి అని కొనియాడారు. శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం తెలుగు శాఖ ఆచార్యులు మేడిపల్లి రవికుమార్ మాట్లాడుతూ రచయిత ఎదగడానికి తగ్గట్టు గొప్ప విమర్శ చేసే రాచపాలెం ఎందరికో ఆదర్శమన్నారు. ఎస్ఎస్‌బిఎన్ కళాశాల కార్యదర్శి డాక్టర్ కె నిర్మలమ్మ మాట్లాడుతూ రాచపాలెం సాహిత్యం, జీవితం రెండు గొప్పవే అన్నారు. ఆయన ఏదైతే చెబుతాడో దానినే పాటిస్తాడన్నారు. డాక్టర్ శాంతి నారాయణ కుమార్తె శాంతి మంజుల రమేష్ బాబు కుటుంబ సభ్యులు కలిసి ఆచార్య రాచపాలెం చంద్రశేఖర్ రెడ్డిని, ఆయన సతీమణి రాచపాలెం లక్ష్మీ కాంతమ్మను ఘనంగా సన్మానించారు. విమల స్మారక సాహిత్య జీవిత సాఫల్య పురస్కారాన్ని అందించారు. 30 వేల రూపాయల నగదు, మెమెంటోతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎస్‌బిఎన్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపేల్ డాక్టర్ రాజు, చిత్రావతి కథల రచయిత ఉప్పరపాటి వెంకటేశులు, అరసం జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ నానీల నాగేంద్ర, బండి యోగి, ఏలూరు యంగన్న, ఆర్ శశికళ, తరిమెల అమర్నాథ్ రెడ్డి, జి. అశ్వర్థరెడ్డి, దాసరి ఆదినారాయణ, సౌరపు గోవిందరాజులు, కంబదూర్ షేక్ నబి రసూల్, కొత్తపల్లి సురేష్, ఆనంద్, పూజారి ఈరన్న, డి గోవిందరాజులు, బాలకొండ ఆంజనేయులు, చామలూరు రాజగోపాల్, అంకె మదన్‌మోహన్, అప్పి రెడ్డి హరినాథ్ రెడ్డి డాక్టర్ అంకె శ్రీనివాస్, చిలుకూరి దీవెన నేషనల్ ఇన్సూరెన్స్ కంపెనీ డివిజనల్ మేనేజర్ ఓబులపతి డి, కృష్ణమూర్తి, అనంత జాషువా హెచ్. నాగలింగయ్య, ఆర్ట్స్ కళాశాల మాజీ ప్రిన్సిపల్ ఎన్. రంగస్వామి, వన్నప్ప, గోసల నారాయణస్వామి, వై సూర్యనారాయణ రెడ్డి పాల్గొన్నారు

'దశమి'కి ప్రశాంతి నిలయం ముస్తాబు

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

దసరా ఉత్సవాల్లో భాగంగా సోమవారం(నేడు) ప్రశాంతి నిలయంలో వేడుకలు నిర్వహించనున్నారు. ఈ క్రమంలో సాయి కుల్వంత్ హాలును సుందరంగా తీర్చిదిద్దారు. ఉత్సవాల్లో పాల్గొనడానికి దేశ, విదేశాలు, పలు రాష్ట్రాల నుంచి భక్తులు, పర్యాటకులు పుట్టపర్తికి చేరుకున్నారు. వారం రోజులుగా ప్రశాంతి నిలయంలో ట్రస్టు ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు జరుగుతున్నాయి. ట్రస్టు సభ్యులు విజయదశమి ప్రాశస్త్యాన్ని వివరించారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా రోజూ సంగీత కచేరి, నాటికలు నిర్వహించారు.

ఎక్కడబడితే అక్కడ వ్యర్థాలు

పట్టించుకోని మున్సిపల్ అధికారులు

వ్యర్థాలను వదిలేస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-కదిరి టౌన్

కదిరి పట్టణంలో ఎక్కడబడితే అక్కడ విచ్చలవిడిగా వ్యర్థాలు వేస్తున్నా మున్సిపల్ అధికారులు పట్టించుకోకుండా చోద్యం చూస్తున్నారనే విమర్శలు సర్వత్రా వ్యక్తం అవుతున్నాయి. కాలువల నిర్వహణ లోపంతో దోమల అధికమై ప్రజలు వివిధ జబ్బుల బారిన పడుతున్నారు. ఇది చాలదన్నట్లు చికెన్ వ్యర్థాలు, పాడుబడిన వస్తువులను నివాసాలు, రోడ్ల పక్కన ఎక్కడబడితే అక్కడ వేయడంతో అపరిశుభ్రత పెరుగుతోంది. కదిరి లక్ష్మీనరసింహస్వామి స్వామి ఆలయ సమీపాన కోనేరు పక్కన మద్దిలేటి వాగులో చికెన్ వ్యర్థాలు, పాత పరుపులు, పాత వస్తువులను గుట్టలుగా వేసేస్తున్నారు. అటువెపుగా వెళ్లాలంటనే ముక్కుమూసికుని వెళ్లాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. అనంతపురం రోడ్డు జడ్జి బంగ్లా పక్కన మరకత మహాలక్ష్మి గుడి పక్కన ఉన్న ఖాళీ స్థలం వ్యర్థ పదార్థాలకు నిలయంగా మారింది. ప్రతిరోజూ హోటల్స్, గ్యారెజ్, ఇంటి నిర్మాణ వ్యక్తపదార్థాలను ఇక్కడ వేస్తున్నారు. ఈ మార్గం గుండా వైశ్యా బ్యాంక్ కాలనీ, ఇందిరానగర్ కాలనీవాసులు రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడుతున్నారు. వీటిపై మున్సిపల్ అధికారులు స్పందించి వ్యర్థాలు వేస్తున్న వారిపై దష్టి సారించి, పట్టణ పరిశుభ్రతకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రజలు సహకరిస్తే...

'భూహక్కు భూరక్ష' రీ సర్వే సులభతరం

సర్వే ల్యాండ్స్ అండ్ రికార్డు జిల్లా అధికారి జిపి. రామక్రిష్ణ

ప్రజాశక్తి పుట్టపర్తి రూరల్

ప్రజలు సహకరిస్తే ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూహక్కు, భూరక్ష పథకం క్రింద రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన రీ సర్వే సులభతరం అవుతుందని సత్యసాయి జిల్లా సర్వే ల్యాండ్స్ అండ్ రికార్డు జిల్లా అధికారి జిపి. రామక్రిష్ణ తెలిపారు. భూతగాదాలు, రహదారులు, సాగుపట్టాలు, భూ ఆక్రమణలు తదితర అంశాలపై ప్రజలు తమ సమస్యలు పరిష్కరించాలని మండల అధికారులనుండి, డివిజన్, జిల్లాస్థాయి అధికారులు చుట్టూ తిరుగుతూ ఉండడం మనం చూస్తూనే ఉంటాం. కొన్ని భూ సమస్యలు కలహాలు, హత్యలు, వరకు వెళ్ళిన సందర్భాలు ఉన్నాయి. కుటుంబంలోనే ఇద్దరి అన్నదమ్ముల మధ్య భూతగాదాలు నెలకొంటున్నాయి. భూసమస్యలపై గొడవలు జరగడం ఇరు వర్గాలు పోలీసులను ఆశ్రయించడం చూస్తూనే ఉన్నాం. ఇలాంటి భూ సమస్యలు ఉన్న వారందరికీ రీ సర్వే వల్ల పరిష్కారం లభిస్తుందని సర్వే ల్యాండ్స్ అండ్ రికార్డు జిల్లా అధికారి రామక్రిష్ణ తెలిపారు. ఈ మేరకు ఆయన ఆదివారం ప్రజాశక్తికి ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు విషయాలను వెల్లడించారు.

జిపి. రామక్రిష్ణ

ప్రశ్న:- రీ సర్వే వల్ల భూ సమస్యలు పరిష్కారమవుతాయని భావిస్తున్నారా?

జవాబు: ప్రజలు సహకరిస్తే భూ సమస్యలు పరిష్కారం అవుతాయి. వందల సంవత్సరాల తర్వాత భూహక్కు, భూ రక్ష పథకం కింద సర్వే చేస్తున్నాం. ప్రభుత్వం సర్వే రాళ్లను సైతం సమీకరించుకుంది. రీ సర్వేతో శాశ్వత భూహక్కు కలుగుతుంది. సర్వే కోసం డ్రోన్లు, విమానాలు సైతం వినియోగిస్తున్నాం. ప్రభుత్వం ఈ కార్యక్రమం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతోంది. ప్రజలకు ఒక్క రూపాయి కూడా ఖర్చు లేకుండా భూహక్కు కల్పిస్తున్నాం. సర్వేకోసం గ్రామానికి వచ్చిన సిబ్బందికి తమకున్న భూమి పట్టాలు, పట్టాపాసుపుస్తకాలను అందజేస్తే సులభంగా సర్వే చేపట్టడానికి అవకాశం ఉంటుంది.

ప్ర: రీ సర్వేలో ఎలాంటి సమస్యలు ఎదురవుతున్నాయి ?

జ: సహజంగానే గ్రామాలలో భూసమస్యలు ఎన్నో సమస్యలు ఎదురవుతున్నాయి. ఉదాహరణకు ఒక కుటుంబంలో ఇద్దరు అన్నదమ్ములు ఉండగా ఒకరు 10 సెంట్లు ఎక్కువ సాగుచేస్తుంటాడు. అప్పుడు ఇద్దరు అంగీకారానికి వస్తే సమస్య పరిష్కారం సులభతరం అవుతుంది. అలాగే కొన్ని భూ అక్రమాలు అన్యాక్రాంతమైన భూము లు ఉంటాయి. కొన్నికోర్టు పరిధిలో ఉంటాయి. అవన్నీ రీసర్వే లో బయటపడే అవకాశం ఉంది. వాటిని పరిష్కరించడానికి ప్రతి మండలానికి ఒక తహాశీల్దారును ప్రభుత్వం ప్రత్యేకంగా నియమించింది.

ప్ర: జిల్లా లో ఎంత సాగు భూమి ఉంది? ఎన్ని గ్రామాలు ఉన్నాయి?

జ: జిల్లాలో సుమారు 2 లక్షల ఎకరాల భూమి ఉంది. 460 గ్రామాలు ఉన్నాయి. ఇప్పటివరకు రీసర్వే కోసం మొదటి ఫేస్‌లో 26 గ్రామాల్లో, రెండవ ఫేస్‌లో 29 గ్రామాల్లో దశలవారీగా రీ సర్వే జరుపుతున్నాం. ఆయా గ్రామ రైతులకు భూమి యొక్క ధ్రువపత్రాలు మేరకు సర్వే పూర్తి చేసి రైతులకు ధ్రువపత్రాలను అందిస్తాం.

ప్ర: జిల్లాలో ఎప్పుడు సర్వే ప్రారంభించారు?

జ: ఒక ఏడాది నుంచి సర్వే పనులు చేపట్టాం. జిల్లాలో అన్ని గ్రామాల్లో సర్వే పూర్తి కావాలంటే మరో ఐదు సంవత్సరాలు పట్టవచ్చు. అసైన్డ్, బంజర భూములు, ప్రభుత్వ భూములు, రైతుల పట్టా భూములు రీసర్వే చేపట్టాం. ఇలా పలురకాల భూము లు ఉన్నాయి. గ్రామాల్లో ప్రజలకు అవగాహన సదస్సులు ఏర్పాటు చేసి రీ సర్వే యొక్క ఉద్దేశాలను ప్రజలకు వివరించాం. కోర్టు పరిధిలో ఉన్న భూములు, రైతుల దగ్గర ఉన్న ఆధారాలు మేరకు సర్వే పూర్తి చేస్తాం.

ప్ర: సిబ్బంది కొరత ఏమైనా ఉందా?

జ: అలాంటి సమస్య ఏమీ లేదు. రీ సర్వేపై నెలలో రెండుసార్లు కలెక్టర్ సమీక్ష నిర్వహిస్తున్నారు. అవసరమైన సిబ్బందిని ప్రభుత్వం సమకూరుస్తుంది. వాస్తవంగా చెప్పాలంటే ఇదొక బృహత్తర కార్యక్రమం. ఆయా గ్రామాల్లో సర్వేకు ప్రజలు అధికారులకు సహకరిస్తూ రీసర్వే సులభతరం అవుతుంది.

మురుగు కుంపట్లుగా 'పురం' చెరువులు

చెత్తాచెదారంతో కలుషితమవుతున్న నీరు

అధికారులు..గుత్తేదారులకు కాసుల వర్షం కురిపిస్తున్న కాలువలు

పట్టించుకోని మున్సిపల్, నీటిపారుదల శాఖ అధికారులు

మురికి కుంపటిని తలపిస్తున్న కొట్నూరు చెరువు

అప్పట్లో ప్రజల కోసం తవ్వించిన చెరువులు నేటికీ ప్రజలకు జీవనాధరంగా ఉన్నాయి. అలాంటి చెరువులు నేడు మున్సిపల్ అధికారులకు, గుత్తేదారులకు కాసుల వర్షం కురిపిస్తున్నాయి. పట్టణంలో ఉన్నా నీటి పారుదల శాఖ కాలువలకు సిమెంట్ పూసి కోట్లాదిరూపాయలు కొల్లగొట్టడమే కాకుండా ఆ కాలువలోని మురుగు తీయడానికి ఏటా లక్షల రూపాయలు ఖర్చు పెడుతున్నారు. అయినప్పటికి కాలువలు శుభ్రం కావటం లేదు. చెరువులు...కాలువల సమీప ప్రాంత ప్రజల కష్టాలు తీరడం లేదు. నిత్యం పట్టణ ప్రజలు కాలువలు, చెరువుల నుంచి వచ్చే దుర్వాసనను భరించడమే కాకుండా...దోమల కాటుకు గురవుతూ ఆసుత్రుల పాలవుతున్నారు.

మురుగు నీటితో నిండిన పెన్నా కుమద్వతి కాలువ

మురుగు కాలువగా మారిన నీటి పారుదల కాలువ

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం రూరల్ మండల వ్యాప్తంగా ఉన్న పరిశ్రమలు వాయు కాలుష్యాన్ని వెదజల్లుతున్నాయి. జనానికి నీటి వనరులుగా ఉండాల్సిన చెరువులను మున్సిపల్ అధికారులు మురుగుకూపాలుగా మార్చారు. దీంతో జల, వాయు కాలుష్యంతో ప్రజారోగ్యం ప్రశ్నార్థకంగా మారింది. పట్టణంలో ఉన్న చెరువులన్నీ మురుగుముప్పులో పడ్డాయి. పట్టణంతో పాటు పెనుకొండ డివిజన్ వ్యాప్తంగా ఉన్నా దాదాపు అన్ని అన్ని చెరువులు నాడు ఈ ప్రాంతాన్ని పరిపాలించిన శ్రీకృష్ణదేవారాయలు తవ్వించారు. ప్రజా సంక్షేమం కోసం తవ్వించిన చెరువులు నేడు నిర్లక్ష్యానికి గురవుతున్నాయి. హిందూపురం పట్టణ పరిధిలో ఉన్న కొట్నూరు, శ్రీకంఠాపురం, సురప్పకుంట, సూగూరు చెరువులు వేలాది ఎకరాల విస్తీర్ణంలో ఉన్నాయి. ఈ చెరువుల కింద గతంలో దాదాపు 8వేల ఎకరాలకు పైగా సాగు జరిగేది. కాలక్రమేణా చెరువులకు నీరు సక్రమంగా రాకపోవడంతో నీరు లేకపోవడంతో వ్యవసాయం కనుమరుగైంది. పట్టణంలో భూగర్భ జలాలు ఇంకిపోకుండా చెరువుకు వచ్చిన నీటిని అధికారులు అలానే ఉంచేవారు. గత ఏడాది విస్తారంగా కురిసిన వర్షాలకు అన్ని చెరువులు పూర్తి స్థాయిలో నిండాయి. ఈ ఏడాది కూడా భూగర్భ జలాల పెంపునకు నీరు అలానే ఉంచారు. అయితే ఇరిగేషన్ అధికారుల నిర్లక్ష్యంతో కొట్నూరు, సురప్పకుంట, శ్రీకంఠపురం చెరువులలో ఆక్రమణలు పెరిగాయి. దాంతో పాటు చెరువులో వ్యర్థాలు వేయడం పెరిగింది. ఇంటి నిర్మాణ మిగిలిన సామగ్రి, ఆసుపత్రిలో రోగులకు సంబంధించిన బెడ్లు, మంచాలు, కోళ్ల, మాంస వ్యర్థాలను వేసి నీటిని కలుషితం చేస్తున్నారు. కొందరు లెట్రిన్ గుంతలు తవ్వితే ఖర్చు అని చెప్పి చెరువు కాలువకు నేరుగా లెట్రిన్ పైప్‌లను ఏర్పాటు చేస్తున్నారు. ఇదిలా ఉండగా మున్సిపల్ అధికారుల అనాలోచిత చర్యల కారణంగా చెరువుల జలాలు కలుషితం అవుతున్నాయి. పెన్నాకుద్వతి ప్రాజెక్టు నుంచి, సురప్పకుంట నుంచి కోట్నూరు చెరువుకు అనుసందానంగా నీటి పారుదల కాలువలను మురుగు కాలువలుగా మార్చి చెరువులోకి వెళ్లే విధంగా అనుసంధానం చేశారు. ఇలా చేయడం వల్ల గత సంవత్సరం కురిసిన వర్షాలకు చెరువులు నిండి కాలువలు పొంగి పొర్లి నీరు కాలనీల్లోకి రోడ్లపైకి వచ్చి లోతట్టు ప్రాంతాలు నీటితో మునిగాయి. వీటితో పాటు శ్రీకంఠాపురం, సూగూరు చెరువులకు అనుసందానంగా మురుగు కాలువలను నిర్మాణం చేశారు. ఇంత చేస్తున్నప్పటికి నీటి పారుదల శాఖ అధికారులు చోద్యం చూస్తున్నారు. ఎప్పుడైన ఒకసారి మున్సిపల్ శాఖ వారికి నోటీసు ఇచ్చి చేతులు దులుపుకుంటున్నారే తప్ప చర్యలు మాత్రం చేపట్టడం లేదు. ప్రస్తుతం హిందూపురం చుట్టు ఉన్నా చెరువులన్నీ మురుగు నీటితో నిండి దుర్వాసన వెదజల్లుతు, దోమల ఉత్పత్తికి నిలయాలుగా మారాయి. చెరువు, కాలువల సమీపంలో నివాసం ఉంటున్న కాలనీవాసుల కష్టాలు అన్నీ ఇన్నీ కావు. మురుగు నీటి వాసనతో పాటు దోమల కాటుకు ప్రతి క్షణం అల్లాడి పోతున్నారు. అనేక వ్యాధులకు గురవుతున్నారు. ఒకప్పుడు మంచినీరు ఉన్న చెరువుల్లో నేడు మురుగునీరు చేరి నీరు నల్లగా మారిపోయాయి. భవిష్యత్‌లో ఈ చెరువులన్నీ హైదరాబాద్‌లోని హుస్సేన్ సాగర్‌లా మారే ప్రమాదంలో ఉందని పర్యావరణ ప్రేమికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చెరువులను కాలుష్యం నుంచి కాపాడాల్సిన బాధ్యత అధికారులు, పాలకులపై ఉంది. దీంతో పాటు పట్టణ ప్రజలు కూడా చెరువుల రక్షణ కోసం తమవంతు కృషి చేయాలని పర్యావరణ ప్రేమికులు కోరుతున్నారు.

చేతులెత్తేసిన మున్సిపల్ శాఖ

పట్టణంలో సర్వే నెంబరు 475ఎలో 129.80 ఎకరాల విస్తీర్ణంలో ఉన్నా సురప్పకుంటలో సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ ఏర్పాటు చేయాలని గత ప్రభుత్వం నీటిపారుదల శాఖ నుంచి 2015వ సంవత్సరంలో మున్సిపల్ శాఖకు అప్పగించింది. అయితే సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ నిర్మాణం ఏర్పాటు చేయకుండా మున్సిపల్ శాఖ చేతులెత్తేసింది. అటవీశాఖలో నిధులు పుష్కలంగా ఉన్నాయని,రూ.5కోట్లతో బోటింగ్, ఉద్యానవనంతో పాటు సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ నిర్మాణం చేపట్టాలని అటవీశాఖకు అప్పగించారు. పనులను వెంటనే ప్రారంభిస్తున్నామని అప్పటి, ఇప్పటి ఎమ్మెల్యే బాలకృష్ణ చెరువులో ఎన్టీఆర్ విగ్రహాన్ని ఏర్పాటు చేసి పనులకు సంబందించి శంకుస్థాపన శిలఫలకాన్ని ఆవిష్కరించారు. అయితే ఆ పనులు ఇప్పటికీ ప్రారంభం కాలేదు. ఇంతకి సురప్పకుంట ఎవరి ఆధీనంలో ఉందో సైతం అర్థం కావడం లేదు. సురప్పకుంట చెరువును పూర్తి స్థాయిలో పట్టణ ప్రజల అవసరాల కోసం ఎస్ఎస్ ట్యాంక్‌గా మారిస్తే ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని నిపుణులు చెప్తున్నారు.

నోటీసులు ఇచ్చాం

పట్టణ పరిధిలో ఉన్న సురప్పకుంట, పెన్నా కుమద్వతి ప్రాజెక్టు నీటిపారుదల కాలువలను ఎటువంటి అనుమతులు లేకుండా మురుగు కాలవలుగా మార్చారు. ఈ విషయంలో పలు మార్లు నోటీసులు ఇచ్చాం. అయినప్పటికి వారిలో కనీస స్పందన కనిపించలేదు. ఈ విషయాన్ని పై అధికారులకు వివరించాం. వారు కూడా నోటీసులు ఇచ్చారు.

యోగానంద,
డిఇ, నీటిపారుదల శాఖ

ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నాం

మురుగు నీరు శుభ్రం చేయడానికి ఎస్‌టిపి ప్లాంట్ ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపాం. అమృత్ పథకం కింద రూ.79కోట్లు కోట్లు మంజూరు దశలో ఉన్నాయి. ఈ పనులను ప్రజారోగ్యశాఖ వారికి అప్పగించారు. త్వరలో ఎస్‌టిపి ప్లాంట్‌లను ఏర్పాటు చేసి మురుగు నీటిని శుభ్రం చేసి చెరువుల్లోకి వెళ్లే విధంగా చర్యలు తీసుకుంటాం.

ప్రమోద్ కుమార్,
మున్సిపల్ కమిషనర్, హిందూపురం

రఘువీరాతో కాంగ్రెస్ నాయకులు

సిడబ్ల్యుసి సభ్యులు రఘువీరాను కలిసిన కాంగ్రెస్ నేతలు

మడకశిర రూరల్ : సిడబ్ల్యుసి మెంబర్ ఎన్.రఘువీరారెడ్డిని ఆదివారం మండల పరిధిలోని నీలకంఠా పురం గ్రామంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కొప్పుల రాజు, జంగా గౌతమ్ మర్యాదపూర్వకంగా కలిసి రాష్ట్ర రాజకీయలపై కాసేపు ముచ్చటించారు. అనంతరం నీలకంఠాపురంలోని దేవాలయాల సముదాయాలను సందర్శించారు.

నేడు 'స్పందన' రద్దు

పుట్టపర్తి రూరల్ : విజయదశమి పండగ పురస్కరించుకొని ఈ నెల 23న సోమవారం ప్రభుత్వ సెలవు కారణంగా జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించే 'స్పందన' కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు ఆదివారం ఎస్పీ మాధవరెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ఈ విషయాన్ని ప్రజలందరూ గ్రహించాలన్నారు. అనంతరం ఆయన జిల్లా ప్రజలకు విజయదశమి పండగ శుభాకాంక్షలు తెలిపారు.

పుట్టపర్తి అర్బన్ : ప్రతి సోమవారం నిర్వహించే స్పందన గ్రీవెన్స్‌ను ఈ సోమవారం (నేడు) రద్దు చేసినట్టు కలెక్టర్ అరుణ్‌బాబు ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ విషయాన్ని అర్జీదారులు గమనించాలని సూచించారు.

'గుండుమల'కు నారా లోకేష్ అభినందనలు

మడకశిర : మంగళగిరిలోని టిడిపి కార్యాలయం లో రాష్ట్ర అధ్యక్షులు అచ్చెన్నాయుడు అధ్యక్షతన జరిగిన విస్తృత స్థాయి సమావేశంలో నియోజకవర్గ ఇన్‌ఛార్జి గుండుమల తిప్పేస్వామిని పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ అభినందించారు. ఓటరు వెరిఫికేషన్, ఇదేం ఖర్మ రాష్ట్రానికి, హౌస్ మ్యాపింగ్, బూత్, మండల, నియోజకవర్గ, జిల్లా కమిటీ, అనుబంధ కమిటీలను పూర్తి చేసుకున్న సందర్భంగా, చంద్రబాబు అరెస్టును ఖండిస్తూ 44 రోజుల నుంచి నియోజకవర్గ వ్యాప్తంగా సామూహిక రిలే నిరాహార దీక్షలు చేపట్టడం, ఇంటింటికీ వెళ్లి చంద్ర బాబు అక్రమ అరెస్టుపై కరపత్రాలు పంపిణీ చేశారు. పార్టీ కార్యక్రమాలు, ఓటరు వెరిఫికేషన్‌లో మడకశిర నియోజకవర్గం రాష్ట్రంలోనే 2వ స్థానంలో ఉన్నందున లోకేష్ తిప్పేస్వామిని అభినందించారు.

కనకదుర్గమ్మ ఆలయంలో పార్థసారథి ప్రత్యేక పూజలు

పెనుకొండ : రాజమండ్రి సెంట్రల్ జైలులో ఉన్న టిడిపి అధినేత, మాజీ సిఎం చంద్రబాబు తొందరగా బయటికి రావాలని, ఆయన ఆరోగ్యం బాగుండాలని ఆకాంక్షిస్తూ ఆదివారం జిల్లా అధ్యక్షులు, పెను కొండ నియోజకవర్గ ఇన్‌ఛార్జి బికె.పార్థసారథి విజయవాడ కనకదుర్గమ్మను దర్శించుకుని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయనతో పాటు ఎమ్మిగనూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి జయ నాగేశ్వర్‌రెడ్డి, సీనియర్ నాయకులు జివిపి నాయుడు, రొద్దం నరసింహులు, చిన్నప్పయ్య, తదితరు లు పాల్గొన్నారు.

పూర్వవిద్యార్థుల ఆత్మీయ కలయిక

గాండ్లపెంట : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. 1997-98లో పదో తరగతి చదివిన విద్యార్థులు పాఠశాల ఆవరణలో గురువులు పామిడి ముంతాజ్‌అలీ, లక్ష్మీనరసింహయ్య, భానుప్రకాష్, కృష్ణమూర్తిలను పూలమాలలు, శాలువాలతో సన్మా నించారు. ఈ సందర్భంగా వారు చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ సంతోషంగా గడిపారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు ఎస్.ఖాజావలి, మున్నా, ప్రభాకర్, జగన్మోహన్ రెడ్డి, పారజాన్, సుమతి, మహేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

రొద్దం : స్థానిక జడ్‌పి హైస్కూల్‌లో 2000-01లో చదివిన విద్యార్థులు ఆదివారం పాఠశాలలో అపూర్వ సమ్మేళనం నిర్వహించారు. అప్పటి ఉపాధ్యాయులను పాఠశాలకు పిలిపించి సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. దాదాపు 22 ఏళ్ల అనంతరం కలవడంతో ఉపాధ్యాయులుతో పాటు విద్యార్థులు ఆనాటి మధుర జ్ఞాపకాలు గుర్తుచేసుకున్నారు. అప్పటి ఉపాధ్యాయులు మాట్లాడుతూ తమను గుర్తుపెట్టుకుని కార్యక్రమానికి ఆహ్వానించడం చాలా సంతోషంగా ఉందన్నారు. అంతకుముందు ఉపాధ్యాయులను ప్రధాన రహదారి నుంచి పూలు చల్లుతూ తీసుకొచ్చారు.

మహిషాసురదేవి అలంకరణలో వాసవీమాత

ముదిగుబ్బ : దసరా ఉత్సవాల్లో భాగంగా స్థానిక కన్యకాపరమేశ్వరి ఆలయంలో ఆదివారం వాసవీమాత మహిషాసురదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అర్చకులు రవితేజ, జయప్రకాశ్, అమ్మ వారిని వివిధ రకాల పుష్పాలతో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆర్యవైశ్యులు భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో క్రిష్ణం సూర్యనారాయణ, మహేష్ కుమార్, నాగరాజు, రత్నం, శ్రీధర్, ఆర్యవైశ్యులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు దుస్తులు పంపిణీ

పెనుకొండ : నగర పంచాయతీ పారిశుధ్య కార్మికులకు ఆదివారం పెనుకొండ నగర పంచాయతీ వైస్ ఛైర్మన్ జయశంకర్‌రెడ్డి దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పెనుకొండ నగర పంచాయతీ ఛైర్మన్ ఉమర్‌ఫరూక్, వైస్ ఛైర్మన్ సునీల్, కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు, వైసిపి నాయకులు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

కార్మికులకు దుస్తులు పంపిణీ చేస్తున్న జయశంకర్‌రెడ్డి

అర్హులందరికీ ఇంటి పట్టాలివ్వాలి

కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి ఎంవి రమణ

ప్రజాశక్తి-చిలమత్తూరు

అర్హులైన పేదలందరికీ ఇంటి పట్టాలు ఇవ్వాలని కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి రమణ డిమాండ్ చేశారు. మండల పరిధిలోని కొడికొండ చెక్‌పోస్ట్ సమీపంలోని 805 సర్వే నెంబర్ జగనన్న లేఅవుట్‌లో పేదలు, లబ్ధిదారులు వేసుకున్న గుడిసెలను ఆదివారం కెవిపిఎస్ నాయకులు సందర్శిం చి వారికి మద్దతు తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఇంటి స్థలాలు లేని పేదలందరికీ ఇంటి పట్టాలు మంజూరు చేయాలని కోరారు. న్యాయబద్ధంగా ప్రభుత్వం వేసిన లేఅవుట్‌లో ఇంటి పట్టాలు అడగడం న్యాయమైన డిమాండ్ అన్నారు. లేఅవుట్ వేసిన వాటిలో పట్టాలు ఇవ్వడానికి తహశీల్దార్‌కి అభ్యంతరం ఏంటని ప్రశ్నిస్తే విలువైన భూమి అనడం హాస్యాస్పదం అన్నారు. కలెక్టర్ హామీ మేరకు శాంతియుతంగా పేదలు జీవనం చేస్తున్నారన్నారు. ముద్దపల్లి లేఅవుట్ లబ్ధిదారులతో పాటు అర్హుల కి పట్టాలు ఇవ్వాలని సిపిఎం ఆధ్వర్యంలో పేదలు చేస్తున్న ఆందోళనకు సంపూర్ణ మద్దతు తెలుపు తూ ఉద్యమంలో పాల్గొంటామన్నారు. కార్యక్రమంలో వ్యకాసం జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్ కుమార్, సిపిఎం నాయకులు లక్ష్మీనారాయణ, రామచంద్ర, చందు, రహంతుల్లా, సదాశివరెడ్డి, శివ, రియాజ్, నాగరాజు, మణి తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కెవిపిఎస్ నాయకులు రమణ

రైతాంగాన్ని ఆదుకోవాలి

టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండుమల తిప్పేస్వామి

ప్రజాశక్తి-మడకశిర

రాష్ట్ర ప్రభుత్వం, వ్యవసాయ అధికారులు వెంటనే స్పందించి వేరుశెనగ పంట సాగు చేసి నష్టపోయిన ప్రతి రైతుకూ ఎకరాకు రూ. 40 వేలు పరిహారం అందించాలని టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షు లు, నియోజకవర్గ ఇన్‌ఛార్జి గుండుమల తిప్పేస్వామి డిమాండ్ చేశారు. రొళ్ల మండల పరిధిలోని దొడ్డేరి పంచాయతీలో ఎండిపోయిన వేరుశనగ పంటను ఆదివారం ఆయన పరిశీలించారు. వర్షాలు లేక వేరుశనగ పంట అంతా ఎండిపోయి రైతులు పెట్టిన పెట్టుబడి కూడా చేతికి అందకుండా పో యింద న్నారు. టిడిపి హయాంలో రైతులకు డ్రిప్, స్ప్రింక్లర్లు, రెయిన్‌గన్‌లు అందించి ఆదుకున్నామ న్నారు. వైసిపి ప్రభుత్వం పంచాయతీకి ఓ రైతు భరోసా కేంద్రం పెట్టింది కానీ రైతులను ఆదుకున్న పాపాన పోలేదన్నారు. ఇది రైతు దగా ప్రభుత్వమని మండి పడ్డారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి గురుమూర్తి, క్రిష్టప్ప, ప్రధాన కార్యదర్శి ఈరన్న, ఉపాధ్యక్షుడు మూర్తి, నియోజకవర్గ తెలుగు యువ త అధ్యక్షుడు బాలకృష్ణ, లక్ష్మీపతి, నియోజకవర్గ కో ఆర్డినేటర్ రామకృష్ణ, నియోజకవర్గ తెలుగు యువత ఉపాధ్యక్షుడు నాగేంద్ర, దాసప్ప, రమేష్, ఉమేష్, మురళి, నరసప్ప, ప్రభాకర్, నగేష్, నాగరాజు పాల్గొన్నారు.

ఎండిపోయిన వేరుశనగను పరిశీలిస్తున్న తిప్పేస్వామి

ఎమ్మెల్యే కేతిరెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు తగదు

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

పట్టణంలో ఇద్దరు వ్యక్తుల మధ్య జరిగిన గొడవకు రాజకీయ రంగు పులిమి ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డిపై జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డి అనుచిత వ్యా ఖ్యలు చేయడం తగదని వైసిపి జిల్లా అధికార ప్రతినిధి గుర్రం శ్రీనివాస్‌రెడ్డి, పట్టణాధ్యక్షుడు నీలూరి ప్రకాష్ పేర్కొన్నారు. పట్టణంలోని ఎమ్మెల్యే కేతిరెడ్డి నివాసంలో ఆదివారం వారు విలేకరుల సమావే శంలో మాట్లాడుతూ రాజకీయ మనుగడ కోల్పోయిన చిలకం ధర్మవరంలో కుట్రపూరిత రాజకీయాలు చేస్తున్నారన్నారు. పరిటాల రవి అండతో గతంలో నియోజకవర్గంలో రెడ్డి సామాజికవర్గాన్ని ఊచకోత కోయించింది నీవు కాదా అని ప్రశ్నించారు. ఇకనైనా చిలకం బేషరుతుగా క్షమాపణ చెప్పి నీచ రాజకీ యాలు మానుకోవాలని లేకపోతే తగిన బుద్ధి చెబుతామన్నారు. సమావేశంలో సచివాలయాల కన్వీ నర్లు చందమూరి నారాయణరెడ్డి, మాసపల్లి సాయికుమార్, తొండమాల రవి, బడన్నపల్లి కేశవరెడ్డి, కోటిరెడ్డి బాలిరెడ్డి, చాంద్‌బాషా, ఎస్పీ బాషా, పెనుజూరు నాగరాజు, కుమారస్వామి, కృష్ణాపురం షహిన్‌షా, చెలిమి పెద్దన్న, గజ్జల శివ, కడప రంగస్వామి, కేశగాళ్ల క్రిష్ణ, చింతా యల్లయ్య, రాయ పాటి రామకృష్ణ, కేతా లోకేష్, నీలూరి వెంకటరాముడు, బాలం గోపాల్, తోపుదుర్తి వెంకటరాముడు, జింకా కంబగిరి పాల్గొన్నారు.

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వైసిపి నాయకులు

ఎమ్మెల్యేపై అసత్య ఆరోపణలు మానుకో

బత్తలపల్లి : 'గుడ్ మార్నింగ్ ధర్మవరం'లో భాగంగా నిత్యం జనంలో ఉంటూ ప్రజల సమస్యలను పరిష్కరిస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకరామిరెడ్డిపై జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డి అసత్య ఆరోపణలు చేయడం మానుకోవాలని వైసిపి మండల కన్వీనర్ మాదిరెడ్డి జయరామిరెడ్డి హితవు పలికారు. స్థానిక వైసిపి కార్యాలయంలో ఆదివారం ధర్మవరం 3వ వార్డు కౌన్సిలర్ జెసిబి రమణ, సింగిల్‌విండో డైరెక్టర్ ఈడిగ కాశప్ప, కోఆప్షన్ మెంబర్ కరీంసాబ్. సచివాలయాల మండల కన్వీనర్ రాంభూపాల్‌రెడ్డి, పెదయ్య, బండి వీరనారప్ప, కుమ్మర వెంకటరమణ, ఉపేంద్రరెడ్డి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎవరో వ్యక్తిగతంగా ఘర్షణలకు పాల్పడి, దాడులు చేసుకుంటే చిలకం రాజకీయ మైలేజీ కోసం వాడుకోవడం విచారకరమన్నారు.

అంబేద్కర్ రాజ్యాంగం అపహాస్యం : చిలకం

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

రాష్ట్రంలో జగన్ రాజ్యాంగం, ధర్మవరంలో కేతిరెడ్డి రాజ్యాంగం అమలు చేస్తూ అంబేద్కర్ రాజ్యాంగాన్ని అపహాస్యం చేస్తున్నారని జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్ రెడ్డి ధ్వజమెత్తారు. రాజారెడ్డిపై దాడికి నిరసనగా ఆదివారం జనసేన ఆధ్వర్యంలో పట్టణంలో శాంతి ర్యాలీ చేపట్టగా అప్పటికే పోలీసులు చిలకం ఇంటిని మోహరించారు. పట్టణంలో శాంతి భద్రతలకు విఘాతం కల్గించే అవకాశం ఉందని శాంతి ర్యాలీ నిర్వహించరాదని పోలీసులు ఆయనకు నోటీసులు అందజేశారు. అయినా ఆయన ర్యాలీని ప్రారంభించగా పోలీసులు అడ్డుకున్నారు. పోలీసులపై గౌరవంతో శాంతిర్యాలీని విరమించుకుంటు న్నానని మరొక రోజు ర్యాలీ చేపడుతామని తెలిపారు. అనంతరం ఆయన తన నివాసంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ జనసేన నాయకుడు రాజా రెడ్డిపై దాడిని అందరూ ఖండించారన్నారు. శాంతి భద్రతలను కాపాడా ల్సిన బాధ్యత పోలీసులపై ఉందన్నారు. పోలీసు వ్యవస్థను తాము తప్పు పట్టలేదని, అధికార పార్టీ నాయకులు దాడులు చేస్తుంటే తాము దెబ్బలు తిని చేతులు ముడుచుకుని కూర్చోవాలా అని ప్రశ్నించారు. సమావేశంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు టిసి వరుణ్, నియోజకవర్గ ఇన్‌ఛార్జులు, రాష్ట్ర, జిల్లా కమిటీ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విలేకరులతో మాట్లాడుతున్న చిలకం మధుసూదన్‌రెడ్డి

ఏటి గంగమ్మ ఆలయ అభివృద్ధికి కృషి

ప్రజాశక్తి-తలుపుల

మేజర్ పంచాయతీ పరిధిలోని ఏటి గంగమ్మ ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని వైసిపి సేవాదళ్ జోనల్ ఇన్‌ఛార్జి డికె బాబు హామీ ఇచ్చారు. ఏటి గంగమ్మ ఆలయం దగ్గర నూతనంగా నిర్మించిన స్టేజిని ఆదివారం ముఖ్యఅతిథిగా హాజరై డికె బాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు ఆలయం చుట్టూ ప్లాట్ ఫారం ఏర్పాటుకు చొరవ చేపాలని కోరగా స్పందించిన డికె బాబు అంగీకరించారు. ప్లాట్‌ఫారంతో పాటు చుట్టూ రూ. 25 లక్షల వ్యయంతో షెడ్డు కూడా నిర్మిం చి ఇస్తానని హామీ ఇచ్చారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో డికె బాబును సన్మానించారు. కార్యక్రమానికి ఆలయ కమిటీ సభ్యులు, వైసిపి మండల కన్వీనర్ డాక్టర్ ఫయాజ్ అహ్మద్, మార్కెట్ యార్డ్ మాజీ ఛైర్మన్ రామకృష్ణారెడ్డి, వార్డు మెంబర్లు మౌలా, శ్రీనాథ్, హరి, రాజగోపాల్‌రెడ్డి, చిన్నపరెడ్డి, కార్యకర్తలు, భక్తులు పాల్గొన్నారు.

ఏటి గంగమ్మ స్టేజి ప్రారంభోత్సవంలో పాల్గొన్న డికె బాబు

రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలి : ఎస్ఐ

బత్తలపల్లి : వివిధ కేసుల్లోని నిందితులు, పాత నేరస్తులు, రౌడీ షీటర్లు గ్రామాల్లో సత్ప్రవర్తనతో మెలగాలని ఎస్ఐ పి.శ్రీనివాసులు హెచ్చరించారు. ఎస్ఐ ఆదివారం పాత నేరస్తులు, రౌడీ షీటర్లనుస్టేషన్‌కు పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ మీపై నమోదైన రౌడీ షీట్‌ను తొలగించేందుకు చాలా కష్టపడాల్సి ఉంటుందన్నారు. గొడవలకు దూరంగా ఉంటూ ప్రవర్తన మార్చుకోవాలని సూచించారు. గ్రామాల్లో ప్రశాంతంగా జీవించాలని, ఎవరి జోలికి వెళ్లవద్దన్నారు. మీపై ఉన్న అపవాదును తొలగించుకునేందుకు మంచిగా నడుచుకోవాలని సూచించారు. కొందరు నేరస్తులు అలాగే వ్యవహరిస్తున్నారని సమాచారం ఉందని, ఇకనైనా పద్ధతులు, ప్రవర్తన మార్చుకో వాలని హెచ్చరించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్ఐ

కెవిపిఎస్, వ్యకాసం ఆధ్వర్యంలో

సంతకాల సేకరణ

ప్రజాశక్తి-చిలమత్తూరు

రాష్ట్రంలో సామాజిక హక్కులు, ఆర్థిక, భూ సమస్యల పరిష్కారం కోసం కెవిపిఎస్, వ్యకాసం ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన 'కోటి సంతకాల' సేకరణ కార్యక్రమంలో ఆదివారం మండలంలో సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి ఎంవి రమణ, వ్యకాసం జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్, కోటి సంతకాల సేకరణ మండల ఇన్‌ఛార్జి చందు మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ కేసుల్లో పోలీస్ స్టేషన్‌లో ఇచ్చే సిఆర్‌పిసి 41 జిఒను రద్దు చేయాలన్నారు. కోనేరు రంగా రావు సిఫారసు మేరకు అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ 2 సెంట్ల ఇంటి స్థలం, 2 ఎకరాల సాగు భూమి ఇవ్వాలన్నారు. ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులు కేటాయించి ఖర్చు చేసి సామాజిక, ఆర్థిక అభివృద్ధికి పెద్దపీట వేయాలన్న పలు డిమాండ్లతో కోటి సంతకాల సేకరణ చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్ర మంలో కెవిపిఎస్ లేపాక్షి మండల కార్యదర్శి గోపాల్‌కృష్ణ, సిఐటియు నాయకులు లక్ష్మీనారాయణ, రామచంద్ర పాల్గొన్నారు.

సంతకాల సేకరణ చేపట్టిన కెవిపిఎస్ నాయకులు

కార్మికులకు దుస్తులు పంపిణీ చేస్తున్న ఛైర్‌పర్సన్ కాజర్ల లక్ష్మి, కమిషనర్ బండి శేషన్న

పారిశుధ్య కార్మికులకు దుస్తులు పంపిణీ

ప్రజాశక్తి-ధర్మవరంటౌన్

దసరా పండుగ సందర్భంగా ఆదివారం సాయంత్రం పట్టణంలోని మున్సిపల్ పరిధిలో పనిచేసే 90 మంది పారిశుధ్య కార్మికులకు యునిఫారం పంపిణీ చేసినట్లు మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న, ఛైర్‌పర్సన్ కాచర్ల లక్ష్మి తెలిపారు. వారు మాట్లాడుతూ పారిశుధ్య కార్మికుల సేవలు వెలకట్టలేనివన్నారు. వారికి కొబ్బరినూనె, సబ్బులు, అటెండర్లకు తెల్ల దుస్తులు, మహిళలకు చీరలు పంపిణీ చేశామని తెలిపారు. ప్రజలు కూడా తమ వార్డుల్లో అపరిశుభ్రత లేకుండా చూసుకోవాల్సి బాధ్యత ఉందని తెలిపారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు మహబూబ్ బాషా, మేస్త్రీలు ఆంజనేయులు, నాగరాజు, నర్సింహులు, పార్థసారథి, తదితరులు పాల్గొన్నారు.

ప్రధాన రహదారిపై పేరుకుపోయిన ఇసుక

ప్రధాన రహదారిపై పేరుకుపోయిన ఇసుక

ప్రజాశక్తి-రొద్దం

మండల కేంద్రమైన రొద్దంలో ప్రధాన రహదారిపై ఇసుక పేరుకుపోయి ప్రమాదాలకు కారణమవుతున్నా పట్టించుకునే వారే కరువయ్యారని స్థానికులు మండిపడుతున్నారు. ప్రధార రహదారిపై ఇసుక చావిడి వద్ద పెద్దఎత్తున ఇసుక పేరుకుపోవడంతో వాహనదారులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. వారం రోజుల క్రితం ఈ ప్రదేశంలో ఒకరు ద్విచక్ర వాహనంపై వెళ్తూ ప్రమాదానికి గురై ఆసుపత్రి పాలయ్యాడు. ఈ మార్గంలో నిత్యం వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఇకనైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి సమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

గెలుపే లక్ష్యంగా పనిచేయాలి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-పుట్టపర్తి క్రైమ్

రాబోయే ఎన్నికల్లో వైసిపి గెలుపే లక్ష్యంగా పని చేయాలని ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి పార్టీ శ్రేణులకు సూచించారు. పట్టణంలోని 6వ వార్డులో ఆదివారం గృహసారథులతో ఆత్మీయ సభ నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లా డుతూ రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనుల గురించి ప్రజలకు వివరించాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ ఓబుళపతి, వైస్ ఛైర్మన్ తిప్పన్న, కన్వీనర్ రంగారెడ్డి, నారాయణరెడ్డి, కౌన్సిలర్లు, ప్రజా ప్రతినిధులు, నాయకులు, వాలంటీర్లు, గృహసారథులు, వార్డు ప్రతినిధులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీధర్ రెడ్డి

గ్రామీణ క్రీడలతో మానసికోల్లాసం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-కదిరి అర్బన్

గ్రామీణ క్రీడలు మానసిక ఉల్లాసాన్ని పెంపొందిస్తాయని ఎమ్మెల్యే పివి సిద్ధారెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని కాలసముద్రంలో వైసిపి నాయకులు మలక ఇంద్రప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఎడ్ల బండ్ల పరుగు పందెం పోటీలను ఎమ్మెల్యే తిలకించి పోటీల్లో విజయం సాధించిన రైతులకు బహుమతులు ప్రదానం చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కేవలం గెలుపు కోసమే కాకుండా క్రీడలను ఆస్వాదించాలన్నారు. పోటీల విజేత ఎడ్ల యజమానికి రూ.40 వేలు, ద్వితీయ స్థానం లో నిలిచిన వారికి రూ. 20 వేలు, తృతీయ స్థానంలో నిలిచిన వారికి రూ. 10 వేలు, నాల్గో స్థానంలో నిలిచిన వారికి రూ. 5 వేలు అందజేశారు. నిర్వాహకులు వైసిపి నాయకులు ఇంద్రప్రసాద్ రెడ్డి, ఎంపిపి అమర్‌నాథ్‌రెడ్డి, రవీంద్ర, తదితరులు పాల్గొన్నారు.

'దొర'ల చేతికి కొల్లాపురి ఆలయం

ప్రజాశక్తి-మడకశిర

రొళ్ల మండల పరిధిలోని చారిత్రాత్మకమైన కొల్లాపురి మహాలక్ష్మి దేవాలయాన్ని దేవాదాయ శాఖ నుంచి దొరలకు అప్పగించినట్లు అనంతపురం, హిందూపురం ఎంపిలు తలారి రంగయ్య, గోరంట్ల మాధవ్ తెలిపారు. దశాబ్దాలుగా దొరల ఆధీనంలో ఉన్న దేవాలయాన్ని రెండేళ్ల క్రితం దేవాదాయ శాఖకు అప్పగించారు. అయితే ఈ ఆలయాన్ని దొరల చేతికి అప్పగించాలని పలుమార్లు ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకొచ్చారున. చివరకు ఇద్దరు ఎంపిల చొరవతో ఈ దేవాలయాన్ని దొరల ఆధీనంలోకి చేర్చారు. దీంతో ఆదివారం ఎంపిలు రత్నగిరిలో ప్రత్యేక పూజలు నిర్వహించి ఆ పత్రాలను దొరలకు అందజేశారు. అనంతరం దొరలు ఎంపిలను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జడ్పిటిసి అనంతరాజు, కన్వీనర్లు నరసింహారెడ్డి, పుట్ట కామప్ప, రంగపరాయ, జెసిఎస్ కన్వీనర నాగేంద్ర వైకాపా నాయకులు పాల్గొన్నారు.

ఆలయ పత్రాలను దొరలకు అందజేస్తున్న ఎంపిలు

ఎమ్మెల్యేని కలిసిన ఆర్‌డిఒ వంశీకృష్ణ

ప్రజాశక్తి-కదిరి అర్బన్

కదిరి నూతన ఆర్‌డిఒగా బాధ్యతలు చేపట్టిన వంశీకృష్ణ ఆదివారం పట్టణంలోని ఎమ్మెల్యే కార్యాలయంలో డాక్టర్ పివి సిద్ధారెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఆర్‌డిఒతో పాటు తహశీల్దార్, విఆర్ఒ ఉన్నారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఆర్‌డిఒని పలువురు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

నేరాలు ఘోరాలు

రైలు కిందపడి వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి-ముదిగుబ్బ

మండల పరిధిలోని మలకవేముల క్రాస్‌లో శనివారం ఉదయం తిరుపతి నుంచి గుంతకల్లు వెళ్తున్న రైలు కిందపడి వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడినట్లు కదిరి రైల్వే పోలీస్ అధికారి రహీం తెలిపా రు. పోలీసులు, మృతుడి బంధువులు తెలిపిన వివరాలు.. తలుపుల మండల పరిధిలోని వీరప్పగారి పల్లికి చెందిన శ్రీనివాసులు(35) జెసిబి ఆపరేటర్‌గా జీవనం సాగిస్తుండేవాడు. ఆరు నెలలుగా మానసిక స్థితి సరిగా లేకపోవడంతో వైద్యుల వద్ద చికిత్స పొందుతున్నాడు. శనివారం శ్రీనివాసులు స్వగ్రామం నుంచి నల్లమాడలోని బంధువులను కలవడానికి వెళ్లాడు. ఆ సమయంలో మలకవేముల క్రాస్‌లో రైల్వే గేటు వేసి ఉండగా జీవితంపై విరక్తి చెంది, క్షణికావేశంలో రైలు కింద పడి మృతి చెందాడు.

మృతి చెందిన శ్రీనివాసులు

కారును ఢీకొన్న ట్రక్

చిలమత్తూరు : మండల పరిధిలోని కొడికొండ చెక్‌పోస్ట్ వద్ద ఉన్న ఫారెస్ట్ చెక్ పాయింట్ సమీపంలో కర్నాటక వైపు వెళ్తున్న కారును ట్రక్ ఢీకొనడంతో చిన్నారులకు స్వల్పగాయాలయ్యాయి. ట్రక్ ఓనర్‌కు పోలీస్ డిపార్ట్‌మెంట్‌తో సత్సంబంధాలు ఉండడంతో కారు డ్రైవర్‌పై విరుచుకుపడే ప్రయత్నం చేశారు. అయితే సీసీ టీవీ ఫుటేజీలను పరిశీలించగా ట్రక్ డ్రైవర్‌దే తప్పని తేలింది. దీంతో పోలీసులు గుట్టుచప్పుడు కాకుండా రాజీ చేసి వదిలిపెట్టినట్లు తెలిసింది.

జిల్లాలో కొనసాగుతున్న సెబ్ దాడులు

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

ఎస్పీ ఎస్వీ మాధవ్‌రెడ్డి ఆదేశాల మేరకు జిల్లా సెబ్ అధికారులు ఆదివారం నిర్వహించిన దాడుల్లో జిల్లా వ్యాప్తంగా పలు కేసులు నమోదయ్యాయి. ఇసుక అక్రమ రవాణా మీద నిఘా వేసి తనకల్లు సెబ్ సిబ్బంది ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకుని పోలీసులకు అప్పగించారు. అలాగే హిందూపురం సెబ్ స్టేషన్ పరిధిలో ఒకరిని అరెస్టు చేసి కర్నాటక మద్యం, బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. కొడికొండ చెక్ పోస్ట్ వద్ద వాహనాల తనిఖీలో భాగంగా ఒకరిని, పెనుకొండ సెబ్ స్టేషన్ పరిధిలో ఒకరిని, మడకశిర సెబ్ స్టేషన్ పరిధిలో ఒకరిని అరెస్టు చేసి వారి నుంచి కర్నాటక మద్యం స్వాధీనం చేసుకున్నారు. పెనుకొండ సెబ్ స్టేషన్ పరిధిలోని బాలప్పగారిపల్లి తండా, కదిరి మండలంలో కేసులు నమోదు చేశారు.

పోలీసుల ఆయుధాలు, వాహనాలకు ఎస్పీ పూజలు

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆదివారం ఆయుధ పూజ ఘనంగా నిర్వహించారు. జిల్లా పోలీసులు వినియో గించే ఆయుధాలు, వాహనాలకు ఎస్పీ మాధవ రెడ్డి పూజలు చేశారు. జిల్లా పోలీసు ఆయుధాగారం, మోటారు ట్రాన్స్‌పోర్టు విభాగాల్లో దుర్గామాత చిత్రపటానికి ఎస్పీ పూజలు చేసి మాట్లాడారు. దుర్గామాత ఆశీస్సులతో జిల్లా ప్రజలు ప్రశాంతంగా, సంతోషంగా జీవించాలని ఆకాంక్షించారు. జిల్లా పోలీసులకు తమ విధులు, సేవల్లో విజయా లు చేకూరాలన్నారు. పర్వదినమైనా, పండుగ బందోబస్తు అయినా పోలీసులు మనస్ఫూర్తిగా నిర్వహిస్తారన్నారు. ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా పోలీసు అమర వీరుల వారోత్సవాలు జరుగుతున్నాయని, ప్రజలు సహకరించి విజయవం తం చేయాలన్నారు. కార్యక్రమంలో ఎఎస్పీ ఎన్.విష్ణు, ఎఆర్ డీఎస్పీ విజయ్‌కుమార్, పుట్టపర్తి డిఎస్పి వాసుదేవన్, ఎస్బి సిఐ రవీంద్రారెడ్డి, డీసీఆర్బీ సిఐ శ్రీహర్ష, ఆర్ఐలు టైటాస్ నారాయణ, రాజశేఖర్‌రెడ్డి, ఆర్ఎస్ఐలు పాల్గొన్నారు.

ఆయుధ పూజ చేస్తున్న ఎస్పీ మాధవ్‌రెడ్డి

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

ధర్మవరం టౌన్ : వయసుతో సంబంధం లేకుండా యోగా సాధన చేస్తే సంపూర్ణ ఆరోగ్యంగీ ఉండవచ్చని యోగా మాస్టర్ నరసింహులు తెలిపారు. ఆయన ఆదివా రం ప్రత్యేక యోగాసనాల వల్ల కలిగే ఉపయోగాలను తెలిపారు. వివేకానంద యోగా కేంద్రం ద్వారా ఆరేళ్లుగా యోగా నేర్పిస్తున్నానని, ప్రతి ఆదివారం ప్రత్యేకం గా వివిధ ఆసనాలు నేర్పడం, దానివల్ల కలిగే ప్రయోజనాలు వివరిస్తామనన్నారు. సమాజానికి సేవ చేయడం, సమాజంలో అందరూ ఆరోగ్యంగా ఉండటమే మా లక్ష్యం అన్నారు. యోగా కేంద్రంలో మహిళలు, పురుషులు, విద్యార్థులు యోగా నేర్చుకోవడం సంతోషంగా ఉందని తెలిపారు. కార్యక్రమంలో టీచర్ నాగరాజు, రమణ, యోగా అభ్యాసకులు పాల్గొన్నారు.

తెలుగు తమ్ముళ్ల వినూత్న నిరసన

పుట్టపర్తి క్రైమ్ : చంద్రబాబు కోసం శ్రీకాకుళం నుంచి తిరుపతికి సైకిల్ యాత్ర నిర్వహిస్తున్న టిడిపి నాయకులపై పుంగనూరులో వైసిపి నాయకులు చేసిన దౌర్జన్యాన్ని ఖండిస్తూ ఆదివారం టిడిపి నాయకులు మోకాళ్లపై నిలబడి నిరసన తెలిపారు. స్థానిక పార్టీ కార్యాలయం ముందు ఐటిడిపి నాయకుడు జయప్రకాష్, అధికార ప్రతినిధి కిలారి శ్రీనాథ్ ఆధ్వర్యంలో మోకాళ్లపై నిల్చొని నినాదాలు చేశారు. దౌర్జన్యానికి పాల్పడిన వైసిపి నాయకులపై అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు శంకర్, పాపారెడ్డి, హరినాథ్‌చౌదరి, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ఆర్థికసాయం

తలుపుల : మండల పరిధిలోని ఓబుళరెడ్డిపల్లి గ్రామానికి చెందిన నన్నే బాషా కిడ్నీ సమస్యతో బాధ పడుతూ ఇటీవల మృతి చెందాడు. దీంతో కదిరి ఎమ్మెల్యే డాక్టర్ పివి సిద్ధారెడ్డి ఆ కుటుంబానికి రూ. 10 వేలు అందజేశారు. ఈ మొత్తాన్ని వైసిపి మండల కన్వీనర్ డిపి.ఫయాజ్, గ్రామ సర్పంచి దీవాన్ వలి, సచివాలయ కన్వీనర్ ద్వారా బాషా కుటుంబ సభ్యులకు ఆదివారం అందజేశారు.

జిల్లా రెడ్డి జెఎసి అధ్యక్షుడికి పరామర్శ

ప్రజాశక్తి-హిందూపురం

రెడ్డి సంఘం జిల్లా అధ్యక్షులు వెంకటేష్‌రెడ్డిపై శనివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు డాడి చేసి గాయపరచగా ఆయన స్థానిక జిల్లా ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ విషయం తెలిసి ఆదివారం వైసిపి నాయకులు వేణురెడ్డి ఆసుపత్రికి వెళ్లి వెంకటేష్‌రెడ్డిని పరామర్శించారు. ఆయనతో పాటు రెడ్డి సంఘం నాయకులు, వైసిపి నాయకులు ఉన్నారు.

తెలుగు మహిళల నిరసన

ప్రజాశక్తి-హిందూపురం

టిడిపి అధినేత చంద్రబాబు అరెస్టును ఖండిస్తూ ఆదివారం తెలుగు మహిళలు పట్టణంలో నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం చంద్రబాబుపై కక్షతో అక్రమ కేసు బనాయించి జైలులో పెట్టించిందని మండిపడ్డారు. చంద్రబాబు నిర్దోషిగా బయటికి వస్తారని ధీమా వ్యక్తం చేశారు. పుంగనూరులో జరిగిన ఘటన వైసిపి రాక్షసత్వానికి నిదర్శనం అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర తెలుగు మహిళ కార్యదర్శి పరిమళ, పట్టణ అధ్యక్షురాలు విజయలక్ష్మి, కౌన్సిలర్లు దుర్గా మంజుల, మహాలక్ష్మి, భారతి, అంగన్వాడీ రాష్ట్ర కార్యదర్శి వెంకటలక్ష్మి, పార్లమెంట్ కార్యదర్శి చెన్నమ్మ, గీతమ్మ, నాగమణి, గంగమ్మ, తదితరులు పాల్గొన్నారు.

అక్రమ సస్పెన్షన్లు ఎత్తేయాలి

ప్రజాశక్తి-హిందూపురం

సచివాలయాల్లో పని చేస్తున్న ఉద్యోగులను వేధింపులకు గురిచేసి, అడ్మిన్ సెక్రటరీలు వారి జాబ్ ఛార్ట్‌కు విరుద్ధంగా చేస్తున్న అక్రమ సస్పెన్షన్‌ను ఎత్తివేయాలి గ్రామ, వార్డు, సచివాలయం దివ్యాంగజన్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు అశ్వర్థ డిమాండ్ చేశారు. అక్రమ సస్పెన్షన్లపై ఆదివారం పి.అశ్వర్థ మాట్లాడుతూ రాజమండ్రి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని అడ్మిన్ సెక్రటరీలు వారి జాబ్ ఛార్ట్‌కు విరుద్ధంగా పనులు అప్పగించి, వాటిని చేయకపోవడంతో అన్యాయంగా సస్పెండ్ చేయడం ఎంతవరకూ న్యాయమన్నారు. సస్పెండ్ చేసిన ఉద్యోగులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ రాజమండ్రి కార్పొరేషన్ కార్యాలయం ముందు చేపట్టిన ఆందోళనకు అసోసియేషన్ తరపున పూర్తి మద్దతు ఇస్తున్నామన్నారు. శాఖల వారీగా జాబ్‌ఛార్ట్ అమలు పరచాలని, జూనియర్ అసిస్టెంట్ స్కేల్‌ను సచివాలయం ఉద్యోగులకు అమలుచేయాలని డిమాండ్ చేశారు.